'ఆ అన్నె మరణిస్తే
ఆ పాపం ఎవ్వరిది?'
అని అడగొద్దు తమ్ముడు
'ఆకలి వల్ల కాదది
అజీర్తి తెచ్చిన చావది'
అని చెప్పారు కదా నేతలు

బాధపడకు తమ్ముడు..
తగలడుతోన్న కాష్టం కాదిది
వెలుగుతోన్న దేశం మనది
నిజం నమ్మ తమ్ముడూ..
వంద కోట్ల బలం మనది
వింతల్లో ఒకటి 'తాజ్ మహాలు' మనది

లెక్కలడగకు తమ్ముడు..
వేల కోట్ల అప్పులు, ఊహకందని స్కాములు
కుంభకోణాలు, కోవర్టు హత్యలు
అన్నార్తుల అరుపులు
ఆత్మహత్యలు, ఆకలి చావులు
నీకు తెలియని నిజాలా తమ్ముడు..

ఆకలేమిటి తమ్ముడు..
అరుపులెందుకు ఇప్పుడు..
స్వర్ణ చతుర్భుజి చూడు
క్రికెట్టు విజయాలు చూడు
మేధావుల పాలన చూడు
మేడి పండు అందం చూడు

బాలకార్మికులొద్దనకు తమ్ముడు
రేపటి కూలీలు కాదా వీళ్ళు
యాభై కోట్ల పేదవాళ్ళని కాదు
వంద బిలియన్ల డాలర్లని చూడు
పనిలేని వాళ్ళని, పస్తులున్న వాళ్ళని కాదు
వలస వెళ్ళిన మేధావులను చూడు
రచ్చగెలిచిన 'మన'వాళ్ళని చూడు

ఏకత్వం ఊసెందుకు ఇప్పుడు
మన 'భిన్నత్వం' గొప్పతనం చూడు

పది మతాలు, పాతిక భాషలు
నిత్య మారణహోమానికి 'అందమైన' ఆజ్యాలు
గుండె మండుతోందని బాధపడకు
'రాముని' రాజ్యంలో ఏడుపెందుకు?

బుద్ధుడు నడిచిన నేల మనది
వేదాలు పుట్టిన భూమి మనది
ప్రాచీన నాగరికత మనది
పవిత్ర సంస్కృతి మనది
గతం చూసి గర్విస్తావో
ప్రస్తుతంతో పోరాడతావో

నీ ఇష్టం తమ్ముడు..
నువ్వే తేల్చుకో తమ్ముడు..
నీకు తెలుసు విప్లవం స్ఫూర్తి ఏమిటో
పోరాడితే పోయేదేమిటో
అన్నీ తెలిసి ఆగకు తమ్ముడు..
తగలడుతోంది దేశం కాపాడు తమ్ముడు..

*11 April 2004*

1. రైతుల ఆత్మహత్యలు: ఒక కేంద్ర మంత్రి recent గా ఒక మీటింగ్ లో 'రైతులు ఆకలి వల్ల కాదు, తిన్నది అరగక చచ్చారు' అన్నారు. అది మన నాయకుల అభిప్రాయం..ఆకలితో, అప్పుల బాధలతో ఆత్మహత్యలు చేసుకున్న రైతన్నల చావుల మీద.

2. central govt. చేస్తోన్న ప్రచారం: భారత్ వెలిగిపోతోంది అని కొన్ని నెలలుగా ఊదరగొడుతున్నారు. ముందస్తు ఎన్నికలంటూ జనాల దగ్గరికి పరిగెడుతూ కారణం ఏం చెప్పాలో తెలియక..'if you can't please them confuse them' అనే principle ని follow అవుతున్నారు.

3. Scams, encounters, debts: పద్దెనిమిది లక్షల కోట్ల రూపాయిల అప్పు, naxals పెడుతోన్న మందుపాతరలు, పోలీసుల ప్రతి చర్యలు..ఇవి ఒక పక్క జరిగిపోతున్నాయి. ఆకలి వల్ల చావులు నిరంతరాయంగా వేరే పక్క.

4. ఆకలి బాధలా..దేశం విజయాలా: దీనికి 30 years క్రితం ప్రపంచ తెలుగు మహాసభల్లో radical students union distribute చేసిన ఒక pamphlet స్ఫూర్తి. ఆకలితో జనాలు ఛస్తోంటే వేల కోట్ల అప్పు తెచ్చి స్వర్ణ చతుర్భుజి ని, fly-overs ని నిర్మించి అద్భుతాలు చేశాం అని ఆనందపడుతున్నారు మన నాయకులు. సమర్థుల నాయకత్వంలో జరుగుతోన్న అభివృద్ధి ఇది..

5. నేటి బాల కార్మికులే రేపటి కూలీలు: మన దేశంలో పది కోట్ల మంది బాల కార్మికులు ఉన్నారు. వాళ్ళ సంఖ్యని తగ్గించడంలో ఏ govt. తీసుకున్న సరయిన చర్యలు లేవు. తీసుకున్న చర్యలు ఫలితాలు ఇస్తున్న ఛాయలు లేవు. వంద billion డాలర్లు దాటిన మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు చూసి గర్వించాలో లేక యాభై కోట్ల భారతీయులు పేదరికంలో మగ్గిపోతున్నారనే నిజం తెల్సుకుని బాధ పడాలో తెలియని పరిస్థితి..గోరు చుట్టుపై రోకటి పోటులా 'మేధో వలస' ఒకటి. ఇంట గెలిచి రచ్చ గెలిస్తే ఆనందమే. కానీ ఇంటిని మర్చిపోయి రచ్చ గెలిచిన వాళ్ళు మన వాళ్ళు అని చెప్పుకోవడం వల్ల మనకి ఒరిగేది ఏమీ లేదు.

6. భిన్నత్వంలో ఏకత్వం: చిన్నప్పటి నుండి ప్రతీ భారతీయుడికీ నూరిపోసే 'నిజాల్లో' ఇదొకటి. కానీ నిజానికి ఈ భిన్నత్వం వల్ల మేలెక్కువ జరుగుతోందో, లేక కీడెక్కువ జరుగుతోందో అనే బాధాకరమైన ఆలోచన రాక మానదు గోద్రా లో జరిగిన అల్లర్లు, ఏళ్ళ తరబడి చల్లారని రామ జన్మభూమి మంటలు చూస్తోంటే..

7. సంస్కృతి, సాంప్రదాయం: ఎంతో పవిత్రమయిన దేశం మనది. చాలా గొప్ప సంస్కృతి మనది. కానీ గతాన్ని చూసి గర్వించాలో, ప్రస్తుతాన్ని చూసి బాధపడాలో తెలియని పరిస్థితి..

8. విప్లవం: వర్తమానం కలిగించే రాపిడే నిప్పురవ్వై, విప్లవ జ్వాలై ఎన్నో దరిద్రాలని తగలబెట్టి ప్రపంచానికి ఎన్నోసార్లు వెలుగుని ప్రసాదించింది. విప్లవం అంటే తుపాకులు తీసుకుని అడవుల్లోకి పోయి ప్రభుత్వం పై ఎదురు తిరగడం కాదు. నిజానికి దేశం ఎదుర్కొంటున్న సమస్యల్లో అది కూడా ఒకటి. ప్రస్తుతం కావల్సినది తుపాకులతో వచ్చే విప్లవం కాదు. మానసిక పరివర్తన వల్ల వచ్చే విప్లవం. యువతరం ఆలోచనా విధానంలో మార్పు వల్ల వచ్చే విప్లవం.

ఆలోచనా విధానంలో రావల్సిన మార్పు ఏమిటి, దాని వల్ల వచ్చే విప్లవం చేసే మేలు ఏమిటి అనేది తరువాతి topic.

*11 April 2004*